

జ్ఞాన యోగం


విచారణ

శాంతి సామ్రాజ్యము









సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

నన్ను "నేను" చేరుకోవటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి, అంతేగాక విలువైన గ్రంధాలు సరైన సంరక్షణ లేక కనుమరుగైపోతున్నాయి, కనుక మన అందరి కోసం భారత ప్రభుత్వం పురాతన ఆధ్యాత్మిక గ్రంధాలను సంరక్షించే నిమిత్తం ఎంతో శ్రమతో కంప్యూటరీకరణ ద్వారా ఒక చోట చేర్చుతూ ఆన్ లైన్ చేయటం జరిగింది. ఇటువంటి విలువైన జ్ఞాన సంపదను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావటానికి సాయి రామ్ సేవక బృందం ఉడతా భక్తి గా ఇప్పటివరకి దాదాపు **5000** పుస్తకాలను వివిధ వర్గాలుగా విభజించి PDF(eBOOK) రూపంలో ఆన్ లైన్ లో ఉచితంగా అందించటం జరిగింది. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం అందించిన భారత ప్రభుత్వపు వెబ్ సైట్(డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా http://www.new.dli.ernet.in), ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in), మైక్రోసాఫ్ట్ వెబ్ సైట్(http://www.microsoft.com) కు మేము ఋణపడివున్నాము.అలాగే ఇటువంటి బృహత్తర కార్యక్రమానికి పెద్ద మొత్తం లో గ్రంధాలను అందించిన తిరుమల తిరుపతి దేవస్థానమునకు కూడా మనం ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in లేక http://www.dli.ernet.in
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com

సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement

సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంధ వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము.

ఈ గ్రంధపు భారత ప్రభుత్వ డిజిటల్ లైబ్రరీ గుర్తింపు సంఖ్య: 2020120035481

SaiRealAttitudeManagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయి నాథ పాద సమర్పణమస్తు *

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

“దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం” అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. “నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది” అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి.

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శాంతిసామ్రాజ్యము

కర్త

'సాధనరహస్య' 'సర్వసిద్ధాంత సౌరభా'ది

బహు గ్రంథకర్తలగు

పరమహంస పరివ్రాజకాచార్య

శ్రీ అనుభవానంద స్వాములవారు

ప్రకాశకులు :

శ్రీ అనుభవానంద గ్రంథమాల

బాపట్ల, గుంటూరు జిల్లా.

విషయ సూచిక

శాంతి_అధికారి

ధర్మప్రవృత్తి

ధర్మశిక్షణ

ధర్మాంగములు

భగవద్విశ్వాసము

శిష్టాచర్యము

వ్యష్టిపరిభానము - సమష్టి

శాంతి సంధాత

శాంతి - తాత్త్వికదృష్టి

పరిసమాప్తి

ద్వితీయ ముద్రణము

ఈ 'శాంతిసామ్రాజ్యము' అను గ్రంథము పరమ హంస పరివ్రాజకాచార్యవర్యులైన శ్రీ శ్రీ శ్రీ అనుభవానంద స్వాములవారిచే రచింపబడినది. ఇది శ్రీ అనుభవానంద గ్రంథమాలయందు 1956 వ సంవత్సరములో పండ్రెండవ కుసుమముగ అచ్చొత్తింపబడినది సుమారు 4, 5 సంవత్సరములనుండి దీనిని అచ్చువేయవలెనని సంకల్పించినను శ్రీస్వాములవారి అనారోగ్యకారణమున అచ్చువేయించలేదు. మరల నేడీ గ్రంథము ద్వితీయ ముద్రణమునకువచ్చుట భగవదనుగ్రహ విశేషము.

శాంతి వ్యష్టిగతము. అందుచేత యీ శాంతిని కాంక్షించు మానవుడు తీవ్రవైరాగ్యయుతుడై ప్రాపంచిక విషయ సంస్కారదూరుడై, యమనియమాద్యనుష్ఠానశీలుడై, తపస్సంపన్నుడై. జితేంద్రియుడైనచో శాంతిసామ్రాజ్యమునకు అధిపతి కాగలడు. ఈ వ్యష్టిగత శాంతిని ప్రపంచమునకు ప్రసాదించుటకు శాంతిదాత ఎంతయో కృషిసల్పును. లోకమున నందరు శాంతిని పొందకున్నను ఆ వ్యక్తుల పవిత్రదృష్టి, పవిత్ర భావములచే, పవిత్ర ఆశీస్సులచే కొంతమందియైనను శాంతి సౌభాగ్యముల ననుభవింపగలరు. అట్టి పరమ సుఖదమై, అమృతమయమై ఆనందదాయకమై అజరామరమైన శాంతిని పొందు విధానము యీ గ్రంథమున వివరింపబడినది.


శ్రీ శ్రీ శ్రీ అనుభవానందస్వాములవారు అనేక గ్రంథములను రచియించి. మన భారతీయ సంస్కృతీప్రాశస్త్యమును దేశ దేశముల ప్రచారము సల్పిన మహనీయమూర్తినాకు గురుపుంగవులు. శ్రీవారు శ్రీ రామకృష్ణ పరమహంస

దేవుని అనుసరించిన సర్వసమన్వయమూర్తి. శ్రీ స్వాముల వారు 1973వ సంవత్సరము మే నెల 17-5-73 వ తేది అనగా వైశాఖ శుద్ధ పూర్ణిమనాడు తమ భౌతికదేహమును వదలిరి.

శ్రీ స్వాములవారి అనుగ్రహవిశేషముచే శ్రీ అనుభవానంద గ్రంథమాల యథారీతిగ తన కర్తవ్యమును తాను నిర్వహించుచున్నది. 1974, 1975 లలో మరల ఆరు పుస్తకములను పునర్ముద్రణము చేయించినది. ఇంకను కొన్ని పునర్ముద్రణమునకు సిద్ధముగా నున్నవి.

ఈ 'శాంతిసామ్రాజ్యము' మరల ప్రపంచమున ప్రచారమునకు బయలుదేరుచున్నది. పాఠకులు శాంతికాముకులై శాంతిని బొంది, అశాంతిని పారద్రోలి, ప్రపంచమునకు ప్రశాంతిని ప్రసాదించుదురుగాక! అందులకై దైవానుగ్రహము కలుగుగాక! మహాత్ముల ఆశీర్వాదములు మనకు ఫలించుగాక!

బాపట్ల | ఇట్లు,
1-12-75 | మాతాజీ త్యాగీశానందపురి



ఓం

శాంతి సామ్రాజ్యము

★

శాంతి—అధికారి

శ్లో॥ విహాయ కామాన్యస్సర్వాన్ పుమాంశ్చరతి నిఃస్పృహః।
నిర్మమో నిరహంకారః స శాంతి మధిగచ్ఛతి॥

ఏపురుషుడు సర్వకామముల వర్జించి విషయాసక్తియు, నహంకార మమకారములును లేనివాడై సంచరించుచున్నాడో, అట్టివాడు శాంతిని బొందుచున్నాడనియు, "స శాంతి మాప్నోతి న కామ కామీ" విషయాపేక్షగలవాడు శాంతిని బొందజాలడనియు, సర్వానర్థదాయక విధ్వంసక ప్రకృతులచే నావరింపబడి, సంక్షుభితమై, సర్వజీవరాసుల హృదయాంతరాళములద్వారా శాంతి నాకాంక్షించుచు, దత్ప్రదాతకొరకై అనుక్షణ నిరీక్షణమున దినముల లెక్కించు నాధునిక ప్రపంచమును సంబోధించి శ్రీకృష్ణభగవాను డుపదేశించిన మహావాక్యము లివి. వ్యష్టి సమష్టు లొక్కటే యనియు, వ్యష్టి బహుళత్వమే సమష్టి యనియు, గాన సమష్టి శ్రేయమే వ్యష్టి క్షేమమనియు, సమష్టి కన్యముగ వ్యష్టి క్షేమము రిత్తయనియు గ్రహింపజాలక, విషయతృష్ణాబద్ధులై, సమష్టిరూప సంఘ క్షేమమును బాటింపని స్వార్థపరుల నుద్దేశించి భగవానుడా మహోపదేశము గావించెను.

ధర్మ ప్రవృత్తి

ఈ విపరీత పరిణామమును భవిష్యత్కాలమున నుప లక్షించియే, సృష్టికి బూర్వమునగల బ్రహ్మము మానవ కోటిని సృజించి, వాని యోగక్షేమపాలకత్వము క్షత్రియా ధీనము గావించియు, నా పాలకులు నియంతలై సంఘమును హింసింతురని వ్యథచెందినవాడై వారి గట్టుదిట్టముల నుంప "తచ్ఛ్రేయోరూప మత్యసృజత ధర్మం" శ్రేయోరూపమైన ధర్మమును సృజించెను. అందుచే నా ధర్మమునకు "తస్మా ద్ధర్మాత్పరం నాస్తి" మించిన శ్రేయము గాంచమని బృహదా రణ్యకోపనిషత్తు బోధించుచున్నది. అహింసాసత్యాస్తేయ బ్రహ్మచర్యాఽపరిగ్రహాది యమరూప వివిధబాహ్యాప్రపంచ పవిత్ర సంబంధములలో గాలాంతరమున బ్రాధాన్యతను వహింపనలసిన సత్యమునే అచట ధర్మమున కన్వయము గావించియున్నను "వాగ్వై బ్రహ్మేతి" అను శ్రుతివాక్యసరణి వాక్కే సర్వప్రవృత్తుల కాధారమై యుండి సాక్షాద్బ్రహ్మమే యగుటచే నద్దాని పవిత్రముగా నుంచుకొనిన సర్వేతరప్రవృ త్తులు పవిత్రవర్తనమున నుండు రహస్యమును గుర్తించి శ్రుతి యా రీతి బోధించియున్నది. అందుచేతనే 'ధర్మ' శబ్ద మా యర్థము నధిగమించి నైతిక జీవితవిధానమున కన్వయమగుచు "యతోఽభ్యుదయ నిః శ్రేయససిద్ధిః స ధర్మః" అను వైశేషిక దర్శన సూక్తివిధమున స్వర్గాపవర్గరూప పరమపురుషార్థ సాధనత్వమే స్వీయ లక్ష్యముగ నుంచి, నిత్యజీవితపారిశుద్ధ్యమే ధర్మముగా బరిణమింపజేసి, లోకోపకారియై చెల్వొందు

చున్నది. అద్దాని నాశ్రయించియే యసంఖ్యాక ధర్మ శాస్త్రము లుద్భవించి, ధర్మకీర్తనము గావించి, యనాది కాలమునుండి లోకమునకు శ్రేయోసిద్ధిని జూపించి, సర్వ క్షేమమునకు మార్గదర్శకములై రాజిల్లినవి.

ధర్మ శిక్షణ

కాని యీ ధార్మిక దృష్టి నార్జించుటకు వివిధ సమస్య లతో నిండి నిబిడీకృతమైన రాజకీయ వాతావరణముకాక విద్యావ్యాసంగముల బ్రోత్సహించు ప్రశాంత వాతావరణ మావశ్యకము. ఇంక నాధునిక భౌతిక విజ్ఞాన ఫలితములగు అసంఖ్యాక విషయేంద్రియ సుఖావిష్ట పట్టణములును, సంతత కృత్రిమ శబ్దాకీర్ణమై యనారోగ్యకర ధూమప్రావృతమై యుండు కర్మాగార ప్రదేశములును గాక; ఆనందోత్సాహ దాయకమై స్వాభావికమై వివిధ పక్షిగణముల కిలకిలారవ ములతోడను, సుస్వాభావిక తేజమున, బ్రకృతీమతల్లి యంక తలమున నభివృద్ధిగాంచుచు నీశ్వరవిలాసమును బ్రత్యక్షము సేయు నారామ, గ్రామ, అరణ్య క్షేత్రములే ప్రశాంత విద్యాసాధనల కత్యంతోపయుక్తములు. అంతియగాక "శ్రోత్రియం బ్రహ్మనిష్ఠం" అను శ్రుతి రీతి శాస్త్రజ్ఞానియు, నాత్మరతుడు నగు యాదర్శమైన నాచార్యసన్నిధానమున గాని ధార్మిక జీవన శిక్షణము బ్రాప్తించదు. అనగా సద్విద్యా విధానమునగాని ధర్మశిక్షణము సాధ్యముగాదు. నిరంతర మాచార్యసన్నిధానభాగ్యమున, నాదర్శమగు ఆచార్య పవిత్ర వాతావరణముచే బ్రోత్సహింపబడి, శ్రవణానుష్ఠానముల

(Theory and Practice) సుశిక్షితులగు విద్యార్థుల జెంపొందింపకల్గుటయే, ఆర్ష విద్యావిధాన ముఖ్యోద్దేశము. అదియే గురుకులాశ్రమ కార్యక్రమము. కేవల విద్యాభ్యాసమునేగాక సాంఘిక జీవనమున కాధారభూతమగు ధార్మిక సూత్రావలంబకులకు శిక్షణము నొసంగు శిక్షణాలయము లగుటచే "విద్యార్థీ చేత్ త్యజేత్ సుఖం" అనునటుల సుఖలాలసత్వమును ద్యజించి, విద్యాదృష్టినుంచుటచే నా సంస్థలు బ్రహ్మచర్యాశ్రమములనియు గీర్తిగాంచినవి. "బ్రహ్మ" శబ్దము వేదమున కన్వయించుటయేగాక సర్వసృష్టికాధార భూతమగు బ్రహ్మపదార్థమగుటచే గురుకులవాసి కేవలము లౌకిక విద్యార్థమేకాక బ్రహ్మానుభూతి కవసరమగు యోగ్యతనుగూడ నార్జించు దృక్పథమున నందు వర్తించుటయు ముఖ్యముగా గాంచనగును. కాన నా విద్యార్థి దృష్టి స్వార్థ విషయాసక్తమగు ప్రపంచ వాసనల నతీతించి, నిస్స్వార్థమై, సమష్టిరూప సంఘశ్రేయోకాంక్షితమై "ఆత్మనో మోక్షార్థం జగద్ధితాయ చ" అను నార్యోక్తి చందము స్వపరక్షేమంకర మార్గగామియై యొప్పారుచుండును.

ధర్మాంగములు

నిస్స్వార్థమై, యలౌకికాధ్యాత్మికానంద సంశోభిత వాతావరణమున జెల్వొందు నా గురుకుల సద్విద్యాసదనములు "సమ్యక్ ప్రశాంత చిత్తాయ శమాన్వితాయ" "శాంతో దాంత ఉపరతి స్తితిక్షుః శ్రద్ధా సమాహితః" అను శ్రుతివచనములరీతి నధికారులగు విద్యార్థులే తెంచుచో

వేదాధ్యయనాది బ్రహ్మవిద్యాభ్యాసములనేగాక, సాంఘిక జీవితవికాసమునకు దోడ్పడు వేదాంగము లనబడు శిక్షా, ఛందస్, వ్యాకరణ, నిరుక్త, జ్యోతిష, కల్పాది లౌకికవిద్యల గూడ వారికి బోధించి ఆదర్శగృహస్థుల జేయ యత్నించును. పూర్వోక్త సాధనసంపత్తి రహిత చిత్తులే యరుదెంచుచో నట్టివారి కా యర్హతలయందు శిక్షణ యొసంగి, పై విద్యా విషయముల ప్రవీణుల గావించుచుండుట పరిపాటి. అందుచే సంఘజీవన మారోగ్యవంతముగ నభివృద్ధిగాంచుటకు కేవలము విద్యయే ఆధారముగాక దాని కధిష్ఠానముగ విద్యార్థుల ధార్మికప్రవృత్తియు ముఖ్యముగ నుండవలెనని గురుకుల విద్యావిధాన రహస్యము.

బ్రహ్మనిష్ఠారతులై యహంకార మమకార వర్జితులై తమ సాధనజనితాధ్యాత్మికానుభవ విభూతిని సంఘ క్షేమమునకై ధారవోయ సంకల్పించి, సంసిద్ధులైన ఆ యాచార్యుల దృష్టి యపరవిద్య లనబరగు లౌకిక విద్యాదులపై నమాత్రము కేంద్రీకరింపబడియుండక, ననగా భౌతిక, మానసిక, ఆధ్యాత్మికములలో భౌతిక మానసికాభివృద్ధికే యత్నింపక నా రెండింటికి బునాది యగుటచే నా ద్వయమునకు శక్తి నొసంగు ఆధ్యాత్మిక పరిస్థితికిని ప్రాధాన్యత నొసంగి, తదాధారమగు అష్టాంగయోగ రహస్యములనుగూడ నుపదేశించుచుండెడివారు. శరీరము మనస్సుచేతను, మనస్సు బుద్ధిచేతను నడుపబడుటచే నాత్మకు సన్నిహితమగు బుద్ధి పవిత్రమైనచో క్రమన్యాయమున మనోశరీరములును బవిత్రములై, సర్వశ్రేయోదాయకములై ప్రవర్తించును. కాన నత్యంత ప్రధానమగు బుద్ధి

సుశిక్షితమై పవిత్రత నార్జింప యమ నియమములతో ప్రారంభించి సమాధ్యనుభూతితో బరిసమాప్తినొందు సాధనాసౌష్ఠవముపై దృష్టి నిలుపవలెను.

యోగసూత్రకారుడైన పతంజలి మహర్షి గొప్ప మానసిక ధర్మశాస్త్ర వేత్త యగుటచే మనోపరిణామ కార్యమున గల గష్టనిష్ఠురముల సాకల్యముగ బరిశీలించి సాధించి, ఆ యనుభవజనితానందఫలసముదాయమును క్రోడీకరించి, మనోజయ సిద్ధికి నుపయుక్త మహోపదేశముల యోగశాస్త్ర రూపమున నిర్మించి లోకమునకు ప్రసాదించెను. చిత్తవృత్తుల నిరోధించి వితర్క విచారానందాస్మితాది సంప్రజ్ఞాతముల ద్వారా నిర్మలము గావించి "సర్వనిరోధాన్నిర్బీజః సమాధిః" అనిర్వాచ్యమైయున్న అసంప్రజ్ఞాత సమాధిరూప ఆత్మానందమున మునిగియుండుటకేగాక యమనియమాది బాహ్యాంతరేంద్రియ నిగ్రహమున సంప్రాప్తమైన శమదమాది సాధన సంపత్తిచే ప్రశాంతచిత్తుడై, సర్వ శ్రేయోదాయక జీవితానుష్ఠానమున బరిసర మానవసంఘమునకు మహోత్కృష్టాదర్శమై, శాంతి ప్రదాతగ మానవుడు పరిణమించు విధానమునుగూడ నా శాస్త్రరాజ ముపదేశించుట మన మహాభాగ్యము. యమ నియమముల ప్రథమతః సాధించినగాని ఆత్మానందవిభూతి హస్తగతము కానేరదని ఆ మహర్షిచంద్రుడు బోధింప వాని కత్యంత ప్రాధాన్యత నొసంగియున్నాడు. వాని విషయము నొకించుక విచారించెదముగాక!

"అహింసా సత్యాస్తేయ బ్రహ్మచర్యాపరిగ్రహా యమాః" యని యోగసూత్రము. ఈ పంచ యమాంగముల

ద్రికరణశుద్ధిగా ననగా మనోవాక్కాయకర్మేణ యనుష్ఠింప వలయునని యాదేశము. అంతియగాక సర్వదా సర్వథా వాని నవలంబింపవలయు ననియు హితోక్తి. అహింసావ్రతము వేదకాలమునగూడ బాటింపబడుచున్నను స్వార్థమున తన్ని యమ పాలనము లోపించుచు వచ్చినది. యుద్ధము, వేట, ఆహా రము, యజ్ఞములయందు తదవలంబనము దూరమైయుండెడిది. కాని భగవాన్ బుద్ధదేవుని కాలమున నది తీవ్రరూపమును దాల్చి జాతి దేశ కాల సమయముల నతిక్రమించి, సర్వకాల సర్వావస్థల ననుష్ఠేయమై మహావ్రతమై ప్రకాశించియున్నది. గాంధీమహాత్ముని కాలమున నహింసయు సత్యాహింసలు మహోన్నతపదవి నాక్రమించి సాంఘికమునమాత్రముగాక, రాజకీయ రంగములగూడ నధిష్ఠించి, సర్వప్రపంచమున కాదర్శమై యొప్పారుట లోకవిదితము. ఇద్దాని ఫలితముగ "అహింసా ప్రతిష్ఠాయాం తత్సన్నిధౌ వైరత్యాగః" అను సూత్రమురీతి నహింసాప్రతిష్ఠితునికి వైరము లేకుండుటయే గాక నతనిపై నెల్లరకు వైర మభావమగుచున్నది. అంతియ గాక నట్టి పవిత్ర సన్నిధానమున సర్వజీవరాసులును తమ పరస్పరవైరముల బరిత్యజించి స్నేహభావమున వర్తించును. ప్రాచీనకాలమున ఋష్యాశ్రమ పరిసరములు సర్వజీవరాసుల కాకరమై సమరసవృత్తుల నిండి యుండినట్లు విదితముగదా! అందుచేత బతంజలి మునివరుండు వ్యష్టి సమష్టుల యభి వృద్ధికి నహింసావ్రతపాలనమే ప్రథమసోపానముగా బరిగ ణించి బోధించి యున్నాడనుట నిస్సందేహము.

"సత్యం యథార్థే వాఙ్మనసే" అనునట్లు యథా

దృష్టమో తథా వాఙ్మనములద్వారా వ్యక్తపరచుట సత్యమని వివరణము. అట్లు సత్యవాక్పరిపాలనమున "సర్వభూత హితం సత్యం" అని వచించుట కెక్కువ అవకాశము లేర్పడుచున్నవి. ఆ సత్యదీక్షయే లేకున్న శ్రీరామచంద్రు డరణ్యముల కేగుట జరిగియుండదు. అందుచే సర్వాదర్శ గ్రంథమగు శ్రీమద్రామాయణము ప్రపంచమున నభూతమై యుండెడిది శ్రీరామరాజ్య మను ఆదర్శ రాజ్యాంగతంత్రము కేవలము శ్రీరామచంద్ర ప్రభువుయొక్క సత్యత్వముమీదనే ఆధారపడియుండుట సర్వ విదితము. కావున నహింసావ్రతమునకు దగు శక్తి సామర్థ్యముల నొసంగి, ఆదర్శ సంఘమును నెలకొల్ప సత్యము బహుముఖముల దోడ్పడుచున్నది. సంఘముపై దాని శక్తి యమోఘమని శాస్త్రవచనము

పై విధాన నేజీవికిని హాని కలుగజేయక దానిగూర్చి యసత్యము లాడకుండుటయేగాక దాని ద్రవ్యంబుల గాంక్షింపకుండుటయే అస్తేయపదార్థము. న్యాయబద్ధముగ నితరులకు గల వస్తు వాహన గృహ క్షేత్రాదిక ద్రవ్యముల నన్యాయముగ గాంక్షించి దాని నపహరించుటయు మాత్రమేకాక, నపహరింప నెంచుటయు స్తేయమనంబడును. మరియు నా ద్రవ్యమితరుల కన్యాయసంపాదితమై యున్నను, అన్యాయముగ నద్దాని గాంక్షించుటయు నన్యాయమై యొప్పారును. గాన నదియు స్తేయమే యగును. న్యాయార్జితములకై యత్నింపక నితరుల ద్రవ్యముల కాసించి, యత్నించి, పీడించి, హింసించి, అపహరించుటయు సంఘమునకు ప్రమాదకరము. ప్రపంచ శాంతికి భంగకరము. అందుచే నట్టి స్వార్థముతో కూడిన

స్తేయమును రూపుమాపుటయే ముఖ్య కర్తవ్యము. ఈ స్తేయము కేవల మపహరణమే గాక బలాత్కార గ్రహణముగ గూడ బరిణమించుచుండుట విదితము. ఇతరుల గంటబడక బరగ్రహణ మపహరణ మగుచున్నది. అట్టిది సాధ్యము కానిచో వస్తుచౌర్యమున కాటంకపరుల హింసించి, లేక హత్య గావించియైన వస్తుసేకరణము గూడ నపహరణమే యగును. కాన స్తేయము పరిమిత మగు ధన వస్తు వాహన గృహ క్షేత్రాదికములగు అవధుల నధిగమించి, రాజ్యసామ్రాజ్యములనబడు అంతర్జాతీయములవరకేగాక నాధునిక ప్రపంచము నావరించియున్న గ్రహాంతరయానము లన్నిటిని స్తేయము తనయందంతర్గతము గావించెను, శాస్త్రపరిశీలనము గావించి యథార్థ విషయగ్రహణము అత్యవసరమైనను ఆక్రమణ మన్యాయము, అపహరణతుల్యము, కాన నదియు నిషేధమే యగుచున్నది. అట్లు మనో వాక్కాయరూప అస్తేయ ప్రతిపాలనమున సర్వ సౌఖ్యములు లభించునని పతంజలి మహర్షి సత్తముని వ్యాఖ్యానము.

అస్తేయ మెట్లో అట్లే బ్రహ్మచర్యముగూడ మిగుల ప్రధానము. పరమపురుషార్థము లనబరగు ధర్మార్థ కామ మోక్షములలో నర్థకామముల ధర్మమోక్షములకై యంకితము సేయుటయే ముఖ్యము. అర్థకామములు మానవుని ప్రపంచ బద్ధునిగ జేసి విషయముల ముంచి నశింపజేయ, ధర్మమోక్షములతని బరిశుద్ధుని గావించి ప్రపంచాతీతునిగ నొనరించుచు సర్వ విషయ విముక్తునిగ జేయును. అర్థకామములు సంఘమున వైషమ్యముల సృజించి యశాంతి ప్రజ్వలింపజేయ, ధర్మ మోక్షములు సర్వప్రశాంతి బ్రసాదించును. కాన నర్థమును

న_స్సేయ సూత్రమున నియమించినచో సంఘమున ననర్థ మర్థ మదృశ్యమగును. ఇక గామరూప కామినీజయముచే బూర్తి శాంతి జగమున ప్రతిష్ఠితమగును. లోకమున పోరాటములు కామినీకాంచనముల నాశ్రయించియే జరుగుచుండుట లోక విదితము. అందుచేతనే మానవుని బంధించు పాశత్రయములో ధనేషణ దారేషణల శాస్త్రములు చేర్చియున్నవి. అట్టి బలీయమైన ధనేషణాజయము గావించి దారేషణపై దృష్టిని ప్రసరింపజేయుట ముఖ్యము. అదియు స్వాధీనమైనగాని ఆత్మశాంతియు లోకశాంతియు సంప్రాప్తింపనేరవు. అన్యాయముగ సామ్రాజ్యముల కాసించి, దుర్యోధను డతి ఘోరమైన భారత మహాయుద్ధమునకు గారకుడై ప్రపంచప్రళయమును గల్పించెనుగదా! అటులే కామినీలోలత్వముచే రావణుడు మహారణమును బురికొల్పి వంశనాశనము నొందియున్నాడు. అందుచేతనే హిందూ ధర్మపాలనములో నీ రెండు విషయములతిప్రాధాన్యత వహించి, ఆ గ్రంథద్వయమును హిందూ సంఘమున సదా పారాయణయోగ్యము గావించి యున్నవి. కావున గామజయమునకై ఆబాల్యము బ్రహ్మచర్యవ్రత దీక్ష అవసరమై యున్నది. అట్టిదానికై “సత్సంగత్వే నిస్సంగత్వమ్ నిస్సంగత్వే నిర్మోహత్వమ్ నిర్మోహత్వే నిశ్చలతత్వం” అను నాచార్యోక్తి ననుసరించి జితేంద్రియులును ఆదర్శనీయులగు ఆచార్యుల సన్నిధానమున బ్రహ్మచర్యవ్రతము సుప్రతిష్ఠితమగును. ‘గుప్తేంద్రియస్యోపస్థస్య సంయమః’ అని విస్పష్టలీల బ్రహ్మచర్య పద వివరణము వ్యాసభగవానులు గావించియున్నారు. అష్టవర్ష ప్రాయమున నుపనయనసంస్కా-

రాదిగా సద్గురు సన్నిధానమున నంతేవాసియై మనుమ నాత్మోద్ధారకమగు ఆపవిత్రోత్తేజకర వాతావరణమునకు నలవడుచు "బ్రహ్మవిద్యయా సర్వం భవిష్యంతః" అను శ్రుతిరీతి బ్రహ్మవిద్యాధ్యయనమును గమ్యముగా గలిగి తదంగములగు లౌకిక విద్యలఁగూడ బఠించుచు నలౌకిక పరిసరముల నున్న ఆవిద్యార్థికి కామ్యములే లేకుండ నిక స్త్రీవ్యామోహము లెట్లావరించును? యౌవనమున బాహ్య దృశ్యములచే నాకర్షింపబడి, చిత్త చాంచల్యమున బహిర్గతమై, అక్రమ పద్ధతుల బ్రసరించి భ్రష్టత నొందు యింద్రియ ప్రవృత్తులు అతీతాధ్యాత్మిక వాతావరణమున భ్రష్టత కవకాశములు లేకయు, మీదు మిక్కిలి ఆదర్శ సాంగత్య మహిమచేతను సంయమనము గావింపబడి కాలక్రమమున ననవసర బాహ్య ప్రవృత్తి నొందు నసమర్థతను బాసి శక్తివంతములై, విద్యాసాధనాభివృద్ధికి దోహదములై చెలువొందును. అందుచే గనీసము ద్వాదశవర్షములు గురుకులవాసభాగ్యము నొందిన బ్రహ్మచారి ఇంద్రియ నిగ్రహకార్య ధురంధరుడై, శాంతిసంధాతయై, సంఘోద్ధరణ మూలసూత్రముగా బ్రకాశించును. అతడు సర్వదాశక్తిమంతుడనుటకు "బ్రహ్మచర్య ప్రతిష్ఠాయాం వీర్యలాభః" అనివిదులు సూత్రీకరించియున్నారు. అట్టివాడాదర్శవంతుడగుటచే నితరులకు "జ్ఞానమాధాతుం సమర్థో భవతి" అనురీతి జ్ఞాన ముపదేశించుటకుఁగూడ సమర్థుడగుచున్నాడు. కాన నట్టి బ్రహ్మచర్యదీక్షాదక్షులే సకల నాచార్య పీఠము నలంకరించి, సంఘ క్షేమంకర బోధ గావింప నర్హులగుచున్నారు. వారి వాక్యములమోఘ శక్తియుక్తములై, అజేయములై, తక్షణానుసరణీయ

ములె రాజిల్లునని శాస్త్రవాక్యములే గాక విద్వదనుభవము కూడ సమర్థించుచున్నది.

సంఘమున కట్టి యమూల్యాదర్శమును ప్రసాదించిన వాడు అపరిగ్రహదీక్షాపరుడై యుండుననుట కెట్టి సందియ మును లేదు. కాని పరిగ్రహణమున గల సర్వానర్థ దోషముల నెట్టెదుట నుంచి, దాని దూరీకృత మొనర్ప నుత్సాహము కలుగజేయు నుద్దేశమున నపరిగ్రహమును గూడ శాస్త్ర కారులు యమమున బంచమాంగముగ జేర్చిరి అనవసర ముల నితరులనుండి అన్యాయముగ గైకొనకుండుటయే గాక నవసరములగూడ స్వీకరింపకుండుటయే యిందలి తాత్పర్యము. పరిగ్రహణ మేవిధానముననున్నను సంఘమున నిర్వర్తింప వలసిన విధ్యుక్తకార్య నిర్వహణమున కది ఆటంకదాయకమై క్రమముగ నాశను బ్రేరేపించి పూర్వార్జిత సర్వ సద్గుణముల నాశపరుప నొక మహా దుష్ట శక్తియై పరిణమించును. కాన నిది పూర్వవర్ణిత చతుష్టయముకంటె బలీయము కాన పంచమ స్థానము నొందియున్నది పరిగ్రహణకార్యము చిన్న చిన్న వస్తువులతో ప్రారంభించి, క్రమముగ విజృంభించి, దేశ ద్రోహకరముగ బరిణమించి సంఘమును బాధించుచుండుట ప్రస్తుత కాలమున వ్యక్తముగదా! అదియు విద్యను విక్రయిం చని, ఎవ్విధినైన ధనము నపేక్షింపని గురువర్యుల పాద పద్మముల చెంత శిక్షణము నొందినవారికే అది లభ్యము కాని యితరులకు అసాధ్యము. ఆ యపరిగ్రహవ్రత వీరులుసంఘము నకు మహాభాగ్యము. అట్టివాడు గల దేశము అదృష్టదేవత. పై లక్షణములుగలవారు పదిమంది రాజ్యతంత్రమున నధి

స్థాతమై యున్నచో ప్రపంచరూపము సంపూర్తిగ మారి పోవును.

ఇంతదనుక జర్చించిన యమ పాలనము సంఘ శాంతికి దోహదమునదై ప్రపంచమున సర్వజీవులతో నిస్స్వార్థమైనపవిత్ర సంబంధమునే ప్రోత్సహించి, శాంతి సౌఖ్యముల బ్రసాదించి పరదేవతామూర్తివోలె రూపొందియుండును. కాని శాంతి సామ్రాజ్యస్థాపనమున కది యొక్కటియే చాలదని శాస్త్ర ముద్ఘోషించుచున్నది, అందుచేతనే బాహ్యేంద్రియనిగ్రహము నాబడు యమము ననుసరించి అంతరింద్రియ నిగ్రహకార్య మునుగూడ శాస్త్రముపదేశించుచున్నది. పూర్వార్జిత సద్గుణ పుంజము లన్నియు వ్యక్తిలో సుస్థిరమగుటకై, సంఘమున సంస్థాపితమగుటకై నియమమునుగూడ శాస్త్రము బోధించు చున్నది.

"శౌచ సంతోష తపః స్వాధ్యాయేశ్వరప్రణిధానాని నియమాః" అని సూత్రకారుల వాక్యము. ఈ విషయములు పూర్వోక్త యమాంగములవలె బాహ్య సంఘముతో ప్రత్యక్ష సంబంధము గలిగిలేకున్నను క్రమన్యాయమున సంఘముపై సూక్ష్మ, సూక్ష్మతర విధమున దమ మహిమను బ్రకటించి, అవ్యక్తరూపముగ సంఘమున బరిణామమును గలుగజేయ గలవు. అంతియగాక యమాంగములు పూర్తిగా స్థూల ములై యుండ బాహ్య జగత్తుతో స్థూల సంబంధ మేర్పరచి, స్థూల పరిణామమును కలుగజేయ, నియమాంగములు పరిసర ములతో సూక్ష్మాతిసూక్ష్మ సంబంధము నేర్పరచుకొని తద్రీతి సూక్ష్మ పరిణామమును కలుగజేయుచున్నవి. అందుచేత

యమముకంటె నియమ మతి ముఖ్యమై యొప్పారుచున్నది. స్థూలముకంటె సూక్ష్మ మతిబలీయముకదా! స్థూల పరిణామ మెంత త్వరితగతి నేర్పడునో అంత త్వరితముగనే నివృత్తి చెందును. కాని సూక్ష్మము స్థైర్యముగా బరిణమించి సులభముగా నశింప నిరాకరించును. మరియు నియమము వ్యష్టిని పరిశుద్ధపరచి, దాని నొక శక్తిస్వరూపముగ బరిణమింపజేసి అందుండి పవిత్ర వాతావరణమును సృజించి, పరిసరములపై బవిత్రతా దీప్తి పుంజముల బ్రసరింపజేసి సంఘ సంస్కరణోద్యమమునకు నా వ్యక్తిని మూలకేంద్రముగా నొనర్చును. కాన నియమ విధానము నొకించుక గ్రహింప యత్నించెదము గాక!

నియమమున గల విషయములు శౌచమునుండి ఈశ్వర ప్రణిధానమువరకు గ్రమమున స్థూలమునుండి అతి సూక్ష్మము వరకు బరిణమించుచున్నవి శౌచము బాహ్యాంతర రూపమున ద్వివిధమై మృజ్జలాదిక ద్రవ్యములచే శరీరశుద్ది గావించుట యగుచున్నది. స్నానాదికముచే బాహ్య శౌచపాలనము లేనిచో శరీరమునం దనేక విధముల మలిన మేర్పడి, చర్మ వ్యాధు లుద్భవించి, అంటువ్యాధులై, తనకు బాధాకరముగ నుండుటయేగాక సంఘమున హేయత్వము జనింపజేయును. క్రమముగ బరిసరముల నది వ్యాపించి సంఘమున ననారోగ్య స్థితిని గల్గించును. అంతియగాక బ్రస్తుతకాలమున సంఘమున గల వ్యాధులలో నధిక సంఖ్యాకములు బాహ్యపరిశుద్ధి చేతనే జనించి, ప్రసరించి, విజృంభించి సంఘమును నాశ

పరచుచున్నవి. అందుచే దన శరీరమును శుభ్రముగా గాపాడుకొనుటయేగాక బరిసరములగూడ బరిశుభ్రముగా నుంచుకొనుచో ననారోగ్యము దూరమై సంఘము శ్రేయో మార్గగామి యగుటకు నవకాశమేర్పడును, కాన నిది చాల ముఖ్యము. మద మానాసూయాది చిత్త మలముల నప నయము గావించుటయే అంతఃశౌచము నా బరగును. అనగా కామ క్రోధ లోభ మోహ మత్సర మదములనా షడ్వర్గము లును, ఆణవ కార్మిక మాయిక మాయేయ తిరోధానము లనెడు పంచమలములును చిత్తమున లేకుండుట నంతఃశౌచ మనియు మనఃశౌచమనియు నందురు. వస్తువును గాంక్షించుట గామము, ఆ వస్తుసంపాదనమున కాటంకమునైే క్రోధము, వస్తు వ్యయమునకై లోభము, వస్తువుపై మోహము, ఆ వస్తు వన్యులదగ్గరగూడ నున్నచో మత్సరము, వస్తువుగల్గుట మదము మొదలగు లక్షణములన్నియు నవలక్షణములై యసంఖ్యాక బాధాకూపములై సంఘజీవితమున నశాంతిని కలుగజేయును. అందుచే నట్టి అనారోగ్యలక్షణ విధ్వంసము అత్యంతావశ్యకము. అటులే ఆణవాది మలపంచక నిరోధ మును ఆవశ్యకమగుచున్నది

ఇట్లు మనోపారిశుధ్యము నొందిన వ్యక్తి చిత్త ప్రశాం తతాభాగ్యము నొందినవాడై, నిత్యతృప్తుడై, సంతోషియై మనును. అతడు సత్త్వశుద్ధి నాబరగు చిత్తశుద్ధిని, దానివలన సౌమనస్యము, ఏకాగ్రత, ఇంద్రియ జయము, ఆత్మదర్శన యోగ్యముల బొంది రంజిల్లును., అందుచేతనే శౌచము ననుసరించి వెనువెంటనే సంతోషము నియమమున ద్వితీయ

స్థానము నలంకరించియున్నది. శౌచమెట్లు ఆరోగ్యవాతావరణము నేర్పరుపగల్గునో అట్లు సంతోషము ఆరోగ్యభావ సముదాయము నొసంగి సుఖము జేకూర్చును. సంతోష మన ప్రాణత్రాణమున కత్యవసరమాత్ర దృష్టి గల్గి తృప్తి నొందుట యనదగును. దానివలన "సంతోషాదనుత్తమః సుఖలాభః" అనునట్లు ఉత్తమ సుఖప్రాప్తి కలుగును. అనగా విషయముల దృష్ణారహిత విత్తనమున దృప్తి గాంచియుండుటయే దీని తాత్పర్యము. నిత్య సంతృప్త చిత్తునికి, నత్యంతావసర ప్రవృత్తులు, నిత్యానందము బాహ్యాంతరముల దాండవించును గాన నా తృప్తి దీప్తులెల్లరపై ప్రసరించి నిత్యోత్సాహమును, ఆనందమును జనింపజేయును. అవునుగదా. దుఃఖించువారి గాంచువారి హృదయములు దుఃఖాన్వితములై దుఃఖాశ్రువుల వెలిగ్రక్కును. అటులే నిత్య సంతుష్టిజనితానందాశ్రు సంతతి ప్రభావముచే నెల్లెడల నానందమే వ్యాపించి యుండుటయందాశ్చర్యమేమి? అందుచేతనే దుఃఖము గల్గువేళల నింట నుండుటయు, సంతోష సమయముల నిల్లు వెడలుటయు వివేకానందుడు నిర్దేశించియున్నాడు. అట్లగుటచే దుఃఖము వ్యాపింపక నింటనే సమసిపోవుచుండును. సంతోష మారోగ్యకర లక్షణములతో దేశవ్యాప్తి గాంచి యెల్లరకు నానందసుధను బంచిపెట్టును. కామసుఖమనియు, దివ్యమైన సుఖమనియు కీర్తింపబడు లోకసుఖములన్నియు దృష్ణాక్షయ సుఖముతో బోల్పరానివి. అందుచేతనే సంతోషసాధన మతి ముఖ్యముగా విరాజిల్లుచున్నది.

అదేవిధానమున "తపో ద్వంద్వ సహనం" అనురీతి క్షుత్పిపాసా శీతోష్ణస్థానాసనాది ద్వంద్వముల, మానాభిమానాదికముల, కష్టసుఖముల యెడల సహనభావము గల్గియుండుట తపస్సగుచున్నది. దాన సంఘ క్షేమ కార్యనిర్వహణ కాలముల నీ తపోశక్తి యవసర మగుచున్నది. కామేంద్రియ సిద్ధి కలిగి ఎంతటి ఘన కార్యమునైన సాధించుటలో నీ తపస్సు మహోపకారి యగుచున్నది. ద్వంద్వ సహనశక్తి లేనివాడు స్వీయ కార్యనిర్వహణాసమర్థుడై పరులపై నాధారపడుచు, దమోమయ జీవితమును గడుప నుద్యుక్తుడగును. అందుచే నన్య కష్ట ఫలితములపై నాధారపడు పరాధీనుడగును. అట్లుగాక స్వకార్యదురంధరత్వమున నాదర్శ కష్టజీవియై, పరులలో నుత్తేజము నెలకొల్పు ఉత్సాహశక్తియై, సర్వోపయుక్త మహామహిమ నాతడు వర్ధిల్లును. అతని వాతావరణమే యాహ్లాదకరము.

దీని కనుగుణముగ "మోక్షశాస్త్రాణా మధ్యయనం" అనునట్లు సర్వ ప్రాపంచిక జీవనము నే యాధ్యాత్మిక సుఖమున కంకితము సేయవలయునో, యీ సర్వైహిక సుఖసంపత్తి దేని అన్వయానంద సుఖసాగరమున రేణువులై తోచుచుండునో అట్టి అద్వయానంద మోక్షసామ్రాజ్యమును గూర్చియు దత్సిద్ధికై సాధనాకలాప వివరణమును, తదనుభూతి నిమగ్నులైన మహాపురుష జీవితోపదేశముల బోధించు సద్గ్రంథ శ్రవణ పఠనము లాతని జీవితమున కొక నూతనాలంకారము నొసంగి శాంతిచంద్రికల నల్గడల బ్రసరింపజేయగల్గును. అంతియగాక ప్రథమమున సూచింపబడిన జందము

శ్రోత్రియత్వముండినగాని దేశాచార సంప్రదాయముల గ్రహించి, తదనుగుణ నాయకత్వము వహించి, సంఘము నుజ్జీవింపజేసి, సక్రమాభివృద్ధికి సహకారి కాగల సమర్థు డెవ్వ ఢును గాజాలడు. అందుచే స్వాధ్యాయముగూడ నత్యావశ్యక మగుచున్నది. దేశ సాంప్రదాయానుసార ప్రబోధ గావించి యత్నించుచో నచిరకాలమున దేశము సంపూర్ణాభి వృద్ధి నొందు నను మహారహస్యమిం దిమిడి యున్నది. స్వాధ్యాయఫలితముగ నిష్టదేవతా సంప్రయోగము నచింప బడియుండ నిక నిష్టదేశాభివృద్ధి సుసాధ్యమగుననుట సమం జసముగదా! ఈ రహస్యమును గ్రహించియే గాంధీమహాత్ము డును సత్యాగ్రహ భగవద్గీతాది సుసంప్రదాయక విషయ ముల హస్తముల ధరించి, అపూర్వ కీర్తి నార్జించి, భారత స్వాతంత్ర్యసిద్ధికై ప్రజానీకము నేకత్రాటి నడిపించి కృత కృత్యుడయ్యెను.

పై యంశముల నెంత గడించి యున్నను నీశ్వరాస్తిక తను విశ్వసింపకున్నచో బూర్వ కృషి యంతయు నిష్ఫల ముకా నవకాశముండును. సర్వశక్తి సముపార్జిత విభూతు లన్నియు దన యల్పత్వమును విస్మరింపజేయుచు మరల నియంతృత్వమునకు, బర పీడనమునకు దారి తీయవచ్చును. అంతియగాక నీ యైహిక సంపత్సుఖములన్నియు మానవుని విశాల దృష్టిని లోపింపజేయుచు, జాతి జాత్యంతర, శాఖ శాఖాంతర, మత మతాంతర, దేశ దేశాంతర తారతమ్య ముల కవకాశమిచ్చుచు, స్వపర భేదముల బెంచుచు, బాషం డత్వమును వర్ధిల్లజేసి, అరాచకమునకు మార్గదర్శి కాగలవు.

అందుచే మానవునిచే ననుభవింపబడుచున్న యానత్ప్రపంచ మునేగాక నాతనికి దిగ్భ్రమ కలుగజేయుచున్న అనంత తారా గ్రహ సముదాయమును, తన కత్యంత సన్నిహితమై చేదోడు వాదోడుగా బ్రవర్తించుచు సర్వము ననుభవింపజేయుచున్న దైనను నొక్కొక్కవేళ వ్యతిరేక ప్రవృత్తిచే నతనిలో గల వరమును జెలరేగదీసి యొక మహత్తర సమస్యగా బరిణమించు చున్న నతని మనస్సునుగూడ సృజించి, పెంచి, కాలగతమున లయింపజేయు నీ అమానుష శక్తిసంపన్నుడు, ప్రజ్ఞాశీలుడు, అఘటనాఘటనా సమర్థుడు సర్వేంద్రియజ్ఞానాతీతుడగు నొక సృష్టికర్త గలడనియు, బ్రథమమున విశ్వసింపవలెను. అతని యధీనములై సర్వ చరాచర జీవకోటి వర్తించి సుఖము నొందుచు, తద్విరుద్ధ ప్రవర్తనముచే దుఃఖము నొందుచు నుండుననియు గ్రహించి, రాజాధిరాజునకు తదధీన ప్రజా నీకము పన్నుల జెల్లించునట్లు ఈశ్వరాధీన మానవుడుగూడ తగు గప్ప మతనికి గట్టవలయు ననియు గ్రహించి, అట్టి యలౌకిక శక్తియుక్తునికి సర్వార్పణముజేయుచు బ్రపన్నత మెలంగుటయే ఈశ్వరప్రణిధాన మనునది నియమ పంచ మాంగము. పూర్వోక్త నవకముకంటె నిది అతి ప్రధానమై వ్యక్తి స్వభావమునేగాక ప్రపంచ రూపమునుగూడ నభివృద్ధి కరముగ బరిణమింపజేయు నద్భుత శక్తియై యున్నది. ప్రాచీ నాధునిక కాలముల సర్వప్రపంచ చరిత్రమును బరిశీలించి చూచుచో నమానుష కార్యధురీణులెల్లరు నా సర్వాధిపతి యగు నీశ్వరార్పణబుద్ధిచేతనే మహత్కార్య నిర్వాహకులై యుండిరను బరమరహస్యము వ్యక్తమగును. కపిల వ్యాసాది

ప్రాచీన మహర్షికోటి యేమి రామకృష్ణాద్యవతార పురుషు లేమి, శంకర రామానుజాది ఆచార్యగణములేమి, బుద్ధ క్రీస్తు మహమ్మదాది మతప్రవక్తలేమి, యీశ్వరార్పణబుద్ధిజన్య మహాద్భుత శక్తివిశేషముచేతనే ప్రపంచోద్ధరణ కార్యమున కృతకృత్యులై యొప్పిరిగదా! రామకృష్ణ, వివేకానంద, గాంధీ మొదలగు ఆధునిక సంఘోద్ధారకులు గూడ నా పరమేశ్వర ప్రపన్నచిత్తయుక్తులై తమ జీవితకాలముననే యావత్ప్రపంచ మును గదిలించి, ప్రజానీక స్థూలవృత్తుల సూక్ష్మమొనరించి, అభౌతిక చిన్మయానంద సంధాన సౌఖ్యమున సర్వ ప్రపంచము నోలలాడించి, దివ్య సందేశముల బ్రసాదించి, సార్థక జన్ములై విరాజిల్లిరి. ఈశ్వరార్పణబుద్ధిలేని ప్రాపంచిక సంపత్తులు ప్రాచీనకాల రాక్షససంపద్విశేష తుల్యములై, ప్రపంచ శాంతికి భంగకరములై, విధ్వంసకరములై సర్వనాశన హేతువు లగుచుండును. ప్రకృతిశక్తుల స్వాధీనపరచుకొనిన రాక్షసశక్తులకు యీశ్వరార్పణ బుద్ధియే పునాదిగా యున్నచో నవి దైవశక్తులై, శాంతిసంధాయకములై, లోక పురోగమన కారకములై చెలువొంది యుండెడివి. అట్లుగాకుంట నవి సంఘమునకు వేరుపురుగులై, సంఘ విచ్ఛేదక శక్తులై సర్వనాశన మొనరించి యుండెను. కాన మన మహర్షిలోకము సర్వేతర ప్రవృత్తులకంటె శక్తులకంటె యీశ్వరప్రణిధానమునకు ప్రముఖస్థాన మొసంగి అద్దానికే సర్వత్యాగ మొనరించి దాని సాధించి, ఆ యలౌకిక దృష్టి మానవకోటిని వీక్షించి, యిందుగల సర్వానర్థదాయక ప్రవృత్తుల దిలకించి, దుఃఖితుల

గసుణించి, దుఃఖమునుండి తరుణోపాయమును బోధించి యావత్ప్రపంచమునకు మహోపకృతి నొనరించియున్నారు.

భగవద్విశ్వాసము

కావున పై వివరింపబడిన యమ నియమ రహస్యములు సంఘమున స్థిరముగ నెప్పుడు నెలకొనునో, అప్పుడే వ్యక్తికి, సంఘమునకు మానవకోటికి శాంతి సంప్రాప్తించును. అట్టిది లేకుండుటయే సర్వానర్థదాయకము ఆ లోపమును సరిదిద్దుకొనుటయే ప్రథమ కర్తవ్యము. అద్దానికై ప్రస్తుత ప్రపంచమున మరుగుపడినట్లు తోచుచున్న ఆధ్యాత్మిక దృక్పథమును బునరుద్ధరించుట యవసరము. అనగా దేశదేశాంతర విభేదములతోగూడిన మతదృష్టియు, దేశ కాల తారతమ్యములచే విభిన్నత జాటించు ఆచార సంప్రదాయ పద్ధతులనుగాక సర్వమతాచారముల కధిష్ఠానముగా నొప్పు భగవదాస్తికత, భగవద్విశ్వాసము, ఈశ్వరార్పణబుద్ధి, మానవలోకమున సుస్థాపితమై యొప్పారినచో సర్వశ్రేయో రాజ్యము ప్రపంచమున నేర్పడగల్గును. మనగౌరవమర్యాదల బొందు మానవుడెంతవాడైనను, నెంత శక్తిసామర్థ్యములు గలవాడైనను, సర్వజ్ఞుడైనను, సజాతీయ తాద్దృష్టి దోషమున గొన్ని మానవజాతిదోషము లాతనియందుఁగూడ దోచుచుండుటచే, క్రమముగ నాతనిపై గల గౌరవము క్షీణించి సంఘ శ్రేయస్కాముడైన ఆవ్యక్తి యాజ్ఞాపాలనమునకుగూడ భంగము వాటిల్లుచుండుట లోకవిదితము. అందుచేతనే కేవలము మహావిష్ణ్వంశసంభూతుడని నాటికాలముననే యనేక మహర్షిగణముచే గ్రహింపబడి, గౌరవ పూజాదికము గైకొనగల్గిన శ్రీరామ

చంద్రుని, దండ్రియగు దశరథుడు బాలునిగను, అసమర్థునిగను దలంచి తన యజ్ఞానమును వ్యక్తపరచెను. అట్లే కైకేయి శ్రీరాముని సవతిపుత్రునిగ చూచి అసూయాగ్రస్తయై అరణ్యవాసునిగ నొనర్చెను. అదేవిధమున శ్రీరాముని యసమాన అద్వితీయ శక్తిసామర్థ్యముల దిలకించియు, నతడవతార పురుషుడే యని గ్రహించియు, నతని మానవాకృతిచే విమోహితుడై సామాన్యునిగ మరుక్షణమున విభ్రాంతుడై రావణు డెదిరించెను. శ్రీకృష్ణచారిత్రమునగూడ నిట్టి దృష్టాంతము లనేకములు గోచరము. అమానుషలక్షణముల నసంఖ్యాకముగ బ్రదర్శించు బాలుని జూచి పుత్రభావమున మమకారదృష్టితో యశోద శ్రీకృష్ణుని గట్టనుద్యుక్తురాలయ్యెను. గోపాలురు తోడువానిగ నతనిజూచికొనిరిగదా! అద్వితీయమైన అలౌకిక శక్తి సంపన్నుడని గ్రహించియు లౌకిక బాంధవ్యమునమాత్రమే గాంచి యతి సన్నిహితత్వము నొందియు నర్జునుడు అజ్ఞానిగ జీవితాంతముపరకు నుండెనుగదా! సజాతీయ దృష్టిదోషముననేగదా బుద్ధ భగవానుడు పడరాని కష్టముల నొందియుండెను. అటులేగదా ఏసుక్రీస్తు శిలువ బాధ ననుభవించెను. మరియు మహమ్మదుప్రవక్త దేశ దేశముల బారిపోవుచు యుద్ధజ్వాలల బాధ ననుభవించుటకు నితరుల దోషదృష్టియేగదా కారణము! అంతవరకేల? మొన్ననేగదా తన శాంతిచంద్రికా మహాత్మ్యముచే నొక్క భారతావనినే గాక యావత్ప్రపంచమునుగూడ నుర్రూతలూగించిన మన గాంధీమహాత్ముని లోక మెన్నిరీతుల విమర్శించి చివరకు హత్య గావింపలేదు.

అందుచే నెంతవాడైనను మానవాకృతి గల్గి మానవపులతో గలసిమెలసి ప్రవర్తించువాడు ప్రపంచమున జిరస్థాయిగ శాంతి నెలకొల్పు సమర్థుడు కాడు కాన బూర్వోక్త మహాపురుషుల కట్టి అమానుషశక్తి సామర్థ్యముల ప్రసాదించి, తన దివ్యమంగళకర గుణపుంజములో నత్యల్ప భాగమును వారిలో ప్రతిబింబింపజేసి, లోకమున గొంతవరకైన లోకక్షేమంకర కార్య నిర్వహణము గావింపజేసిన సర్వమతాంతర్గత పరమేశ్వరునిపై దృష్టుల బ్రసరింపజేసి అతని యనుగ్రహవీక్షణా నిరీక్షవృత్తి ధార్మిక జీవితమును గడుపుచు, దా జేయు సర్వ కార్యముల నాతని కృపాపాత్రతకొరకే యని విశ్వసించి చేయుచు, మానవసేవయే మాధవసేవ అనుటయే గాక సర్వకార్యముల నీశ్వరారాధనగా గావించుచు, నాత్మోద్ధరణ, సంఘోద్ధరణములకై కృషి గావించు టుచితమని ప్రాచీనుల దాత్పర్యము. అట్టి పరమాదర్శ దృక్పథమున గావించు సర్వకార్యములు నిర్మాలిన్యములై, ఆదర్శవంతములై, లోకహితంకరములై చెల్వొందును.

శిష్టాదర్శము

అట్టి మహాదాదర్శ మార్గగాములై, ప్రాచీనకాలమున మహర్షివరేణ్యులు తమ తమ వ్యష్టి కామ్యముల బ్రక్కనుంచి, యుగ్రారణ్యముల ఘోరతపశ్చర్యచే మహోత్కృష్ట తాత్త్విక సిద్ధాంతముల గ్రహించి, లోకమునకు బ్రసాదించి యుండిరి. ఆదివిద్వాంసుడును, నతి ప్రాచీనుడును నైన కపిల మునిచంద్రుడు కర్దమ దేవహూతి గర్భముక్తాఫలమై ప్రపంచమునగల (ఆధ్యాత్మిక, ఆధిదైవిక, ఆధిభౌతిక దుఃఖముల

యునికిని విమర్శించి, గ్రహించి వానినుండి మానవకోటి నుద్ధరింప సర్వప్రపంచమునకు ప్రథమ తత్త్వశాస్త్రముగా సాంఖ్య సిద్ధాంతమును ప్రకటించియుండెను. అటులే యైహిక సుఖములబారి జనక ప్రపంచ దుఃఖమునకు గారణము మనోచాంచల్యమని యెరింగి తన్నిరోధ స్వాధీనములకై పతంజలి యోగిపుంగవుడు యోగ దర్శనమును ప్రసాదించియుండెను. వ్యాసభగవానుడును ఈశ్వరరూప నిర్వచనము గావించి, మానవకోటి దృష్టుల స్థూలములై క్రుంగదీయు లౌకికసుఖ సంపదనుండి యుద్ధరించి, అలౌకికానంద సంధానమున ప్రతిష్ఠింప వేదాంత సూత్రముల నిర్మించి, ఆచంద్రతారార్కముగ ప్రపంచమున దాత్త్విక దృష్టిని సంస్థాపించియున్నాడు.)

పురాణపురుషుడైన హరిశ్చంద్ర చరితా మాధుర్యమును జవిచూడని భారతీయుడుండడు. ఆ సార్వభౌముడు సత్యాదర్శమునకై సర్వమును త్యాగము చేసి ప్రపంచ చారిత్రమున నొక యలంకారమై చెల్వొందియున్నాడు. రామరాజ్య గాథ నెల్ల రెరింగినదియే శ్రీరాముడరణ్యముల కేగనేల? ఇడుమల గుడువనేల? రాక్షసుల నెదుర్కొననేల? ఆ మహాప్రభుజీవితమున సర్వకార్యములును లోకాదర్శమునకేగదా! రావణు జయించి సింహాసనము నధిష్ఠించి, సర్వసామ్రాజ్యాధినేత యయి యుండియు, పవిత్రమాత సీతను గాననముల బరిత్యజించుటయందు గల రహస్యము చాకివాని మాటయేగదా! అనగా సంఘక్షేమమేగదా! ఆరాంజేమ్రనికి ప్రజయే ఈశ్వరమూర్తియై స్వీయ దారాపుత్రాదికమంతయు నత్యల్పముగ గోచరించుటయం దాశ్చర్యమేమి? అటులే

శ్రీకృష్ణపరమాత్మయు జక్రవర్తుల నేర్పరచు నియంతయై యుండియు, నాధ్యాత్మిక దృష్టి ప్రభావమున దా చక్రవర్తిత్వము స్వీకరింపక, సామాన్య మానవజీవితానందమున మునిగి, నిష్కామ కర్మమార్గమున బోధకుడై, యా అనాసక్తయోగము ను లోక క్షేమమునకై అర్జునునిద్వార బోధించియుండెను.

చారిత్రికయుగమున దిలకించుచో బుద్ధ భగవానుని యాదర్శము లోకము నంతటిని అద్భుతాశ్చర్య చకితుల గావించును. ఆ నవయావన చక్రవర్తి నృద్ధ జనకుని, అతి సుందరవతియగు సతిని, చిదిపిన పాలుగారు పసికందువును, సామ్రాజ్యమును, నెపరి సుఖమున పేక్షించి ఆ మహానుభావుడు త్యజించెను? ప్రపంచమున గల దుఃఖ నివారణోపాయ మెందున్నను జివరకు నరక కూపమునన్నను సాధించి, గ్రహించి, లోకమున బంచిపెట్టువరకును నిద్రాహారములగూడ నర్జించు తీవ్రదీక్షాపరుడగుటకు గారణ మెయ్యది? లోక క్షేమమేగదా! ఆ మహనీయుని బ్రశాంత తేజోకిరణప్రసార తాడితమనస్కుడై గదా బింబిసార చక్రవర్తి ఆదర్శ రాజ్యాంగతంత్రమును నడిపెను? రక్తము జిందింపక క్షేమంకర కార్యములచే బ్రజల నాకర్షించి సామ్రాజ్యమును విసరింప జేసి అహింసావ్రత దీక్ష ప్రజలలో జొప్పించి, అన్యాయ ప్రవర్తనము నభావము గావించి, సర్వ శ్రేయోరాజ్యమును స్థాపించి, నేటికిని బ్రపంచమున నద్భుత చక్రవర్తిగ గీర్తినార్జించి, ప్రస్తుత భారత ప్రభుత్వమున కాదర్శమూర్తియైన అశోకుడు ఆ బుద్ధదేవుని యాధ్యాత్మికశక్తి ప్రసార మహిమాకర్షిత చిత్తుడు కావుట చేతనేగదా! అటులే యేసు అష్టకష్టములకు లోనయినను

నీశ్వరుపైనే దృష్టుల నుంచి ఈశ్వర సంతానమగు మానవ కోటిని సన్మార్గమున నడిపింప యత్నించి శిలువ కర్పణమై, సర్వమానవోద్ధరణ కార్యమున జయము గాంచెను; ఆ యాధ్యాత్మిక దృష్టి మహిమచేతనే మహమ్మదు మొదలగు ననేక ప్రవక్తలు సర్వసౌభ్రాతృత్వ స్థాపనమునకై పెక్కుడుమల బాలైరి! నాగార్జునుడేమి, శంకరుడేమి, రామానుజ మధ్వాచార్యులేమి యా ఈశ్వర ప్రేరిత ప్రబుద్ధ చిత్తులై, స్వార్థత్యాగధనులై తమ యాత్మానంద సౌఖ్యముల సంఘమున నాటి యసంఖ్యాకులకు శాంతిభిక్ష నొసంగిరి. శ్రీరామకృష్ణ వివేకానందాది యుగపురుషులును ఆ యీశ్వరార్పణ బుద్ధిజనిత మహాశ్శక్తిచే మానవకోటికసాధ్య కార్యనిర్వహణా ధురీణులై అనాధారణ త్యాగోద్భూత సాధనామగ్న చిత్తులై మత మతాంతర విభేదముల దుడిచి, సర్వసౌభ్రాత్రార్థ దివ్య సందేశముల బ్రపంచమున నల్గడల జాటి, మహోపకారము గావించిరి. అదే విధముగ మహాత్మ గాంధియు నాబాల్యమాదర్శ ప్రశాంత రామరాజ్య స్థాపనోద్దేశమున శ్రీరామ కార్యదీక్షాదక్షుడై, సహస్రాధి బాధలకోర్చి, భవిష్యత్కాల శాంతిసామ్రాజ్యమునకు బునాదుల నిర్మించెను. అందుచే బ్రపంచమున నేకార్యము జేసినను నద్దాని నాధ్యాత్మిక దృష్టితో ననగా వ్యష్టి సమష్టుల శ్రేయస్సు నపేక్షించి యాచరించుట ముఖ్యముగా మహాపురుషుల జీవితోపదేశములు చాటుచున్నవి.

వ్యష్టిపరిభావము — సమష్టి

మరియు వ్యక్తికిని సంఘమునకునుగల సంబంధ మెట్టి

దని విచారించుచో సంఘమున వ్యక్తి బహుళత్వమే యని గ్రాహ్యమగును. వ్యక్తియే సంఘము, సంఘమే వ్యక్తిగ రూపొందుచున్నది. కాన సమష్టి యనబడు సంఘ పారిశుద్ధత వ్యక్తి పవిత్రతపై నాధారపడి యుండును. వ్యక్తి పరిశుద్ధు డగుచో సంఘముగూడ గాలక్రమమున పరిశుద్ధమై శాంతి నొందియుండును. మంచిగంధము వృక్షముల యరణ్యమునగల సర్వేతర వృక్షజాతులు నావృక్ష సజాతీయత్వము నొందునను నార్యోక్తి చంద మాదర్శ మహాపురుష సన్నిధానమున బరిసరములు బునీతములై క్రిమన్యాయమున దాదాత్మ్యత నొందుచున్నవి. అట్లుగాక దుర్మార్గుని యునికిచే వాతావరణము సంక్షుభితమై బాధాకరమై నీచత్వమును బొందును. అట్లే గదా ఫలరాశిగల శ్రేష్ఠత కుళ్ళిన ఫల సంగమముచే నశించి రాశియంతయు నచిరకాలమున భ్రష్టత నొందునుగదా! ఆ సూత్రముననేగదా క్షీరము దధిరూపము వహించుట! ఎంతటి బలమైనను సంఘమైనను ననారోగ్యపురుషుని యునికి చేవ్యాధిగ్రస్తమై నశించుచున్నది. అటులే అనారోగ్య భావ సంచయముగల దుర్మార్గునిచే సంఘము చెడి కల్లోలిత మగుచున్నది.

ఈ విషయమునే వివరించుచు శంకర భగవత్పాదులు "సత్సంగత్వే నిస్సంగత్వ" అను సూక్తిని గానము చేసియున్నారు. అనగా సత్సాంగత్య మహిమచే నెంతటి దుష్టాత్ముడైనను సన్మార్గవర్తను డగునని తాత్పర్యము. వ్యక్తిలో జనించు భావజాలములు వెంటవెంట నదృశ్యమొందక, నా వ్యక్తిలో సంస్కారరూపమున నంతర్గతమగుటయేగాక,

బాహ్య వాతావరణమున అనుద్భూతస్థితిలో నెగురుచుదిరుగు చుండును. ఆ పరిసరములగల వారెట్టివారైనను చిత్తవృత్తులు లేని ప్రశాంతతనున్న సమయముల నాచిత్తమున ప్రవేశించి, యందు నాటి, మొలకరించి యభివృద్ధినొంద యత్నించును. ఆ భావము దుష్టమైనచో శిష్టునినైన మార్ప యత్నించును. అది బలీయమైనచో శిష్టత్వమునకు బాధ కలిగి ఆ శిష్టుడు దుష్టవర్తనుడుగా మారిపోవును. అటులే భావము శిష్టమైనచో దుష్టుడైనను శిష్టుడుకా నవకాశ మేర్పడుచున్నది.

మరొక సిద్ధాంతమున బ్రపంచమునంతట జీవకణములగు స్కంధములు వ్యాపించియున్నవి. అవి ప్రవాహరూపముగ నొక వ్యక్తి నుండి మరియొక వ్యక్తికి బ్రసరించుచుండును. కాని అవి ఆ యా వ్యక్తుల సంస్కారముల గొన్నింటిని వెంట గైకొను చుండుటచే నొక పురుషునిలక్షణముల నితర పురుషులకు జేర వేయుచు నా యా పురుషుల స్వభావములనే పరిణమింప జేయుచు నుండునని తజ్ఞులందురు పుంఖానుపుంఖములుగ నీ స్కంధసముదాయ మసంఖ్యాకముగ నెకనున కేదు పర్యా యములుగ నొక్కొక్క పురుషునుండి బహిర్గత మగుచుండునని యా సిద్ధాంతము. అందుచే సంతత ప్రవాహరూప సంస్కార స్కంధముల నీదులాడుచున్న పురుషునికి వ్యష్టిత్వము కేవ లము భ్రాంతిరూపమేకాని ప్రత్యేక సత్యముగాదని విది తము. అట్టిచో బెద్దయంత్రమున గల అల్పాంగమున కెట్లు వ్యక్తిత్వ మభావమో అటులే యీ ప్రపంచరూప సమ ష్టిలో వ్యష్టికి వ్యక్తిత్వము సంపూర్ణముగా శూన్యము. సాగరమున తరంగములవలె వ్యష్టి నామరూపాత్మకముగ

సమష్టియందే దోచి మరల నందే లీనమగుచున్నదని యంత రార్థము.

ఈ రహస్యమును గ్రహించి మానవుడు తన రక్తము ద్వారా తన దారాపుత్రాదికముననేగాక తరతరములపర్యంత సంతానమునకు దన సంస్కారముల బ్రవహింపజేయుచుం డుటయు, అంతియగాక దన దుష్టత్వ శిష్టత్వముల నగోచరలీల బూర్వోక్తవిధముగ బరిసరజీవకోటిపై బ్రసరింపజేసి కలుషిత ముగనో, పునీతముగనో యొనర్చుచుండుటయు గ్రహించి నచో, నట్టి అతి భార బాధ్యతను గుర్తించుచో అతనిలో నెట్టి పరివర్తన మేర్పడునో! శిష్టత్వమునే బెంపొందింప యత్నించు వానిలో శిష్టభావములు, తదనుగుణ స్కంధములు బ్రవేశించి రాణించుటచే నీ రహస్యము నెరింగినవా డచిర కాలమున నెట్టివిధముగ బరిణమించునో! ఈ కీలకము నెరింగి తదనుగుణ వర్తనము గల వ్యక్తి కాలక్రమమున నొక ఆధ్యా త్మిక మహాశక్తి యంత్రమై, తన మూర్తినుండి అవ్యక్తము గనే అసాధారణ శిష్ట సంస్కారప్రసారములచే మానవకోటి నుద్ధరించి యెంతటి లోకోపకారి యగునో! అట్టివాడు యేమరు పాటు గాంచక, నప్రమత్తత లేక, నిత్య జాగృతి నసించి, మహోన్నత భావములకు యంత్రాగారమై, తదభావ లోక మున వాని నుజ్జీవింపజేసి, జగదుద్ధరణశీలుడై కృతకృత్యు డగుచున్నాడు. వాని జీవితము ధన్యము. ధన్యాతిధన్యము.

శాంతి సంధాత

ఈ అద్భుతాదర్శ స్థితి సముపార్జనమునకు లౌకిక భావ ములు, వ్యక్తులు నసమర్థములు. "నీచాః కలహ మిచ్ఛంతి

సంధి మిచ్ఛంతి సాధవః” అనురీతి సంఘమున శాంతి నాకాంక్షించువాడు శాంతుడై యుండినగాని యతని కాంక్ష సఫలము కానేరదు. స్వీయ నేత్రముల గల దూలముల జూడనొల్లక నితరుల గన్నుల గల నలుసులకై యన్వేషించువారధికముగదా! స్వీయ దోషముల బ్రిభమతః బరిశీలించి, గుర్తించి, గమనించి, సంస్కరించి, పిమ్మట బరదోషముల సంస్కరింప యత్నించు సంస్కర్త లేరి? తా జేయున ట్లాచరింపక బోధించున ట్లనుసరింప నాదేశించు గురువు లేగాని బోధనానుష్ఠానముల దమలో మేళవింపజేసుకొని యితరుల కుపదేశించు ఉపదేష్ట లేరి? కోపమును జయింపుమని కోపించు ఆచార్యులేగాని కోపతాపవివర్జితాదర్శ మేది? అందుచే నున్న తాధ్యాత్మిక ప్రశాంతచిత్తులై, యలౌకికానంద నిమగ్నులగు ఆదర్శ పురుషులు, కామ్యావివర్జిత మనస్కులు, నిష్కామ కర్మ ధురీణులు, కరుణార్ద్రహృదయులు, సర్వ సమన్వయ సమరస భావగంభీరులు నగు మహాపురుషులు శాంతి సంధాత లగుదురుకాని అన్యులు కానేరరు.

శాంతి – తాత్త్వికదృష్టి

కాన సర్వ ప్రపంచమతముల కధిష్ఠానములై తాత్త్విక దృష్టి నొసంగిన మతాచార్యులగు శంకర, రామానుజ, మధ్వాది గురులోకము తత్త్వదృష్టితో దీని నెట్లు తీర్మానించిరో చూచెదముగాక!

నిర్వికార నిరాలంబ నిరాకార నిరంజన నిర్మల నిరతిశయ నిశ్చలానిర్వాచ్యమైన బ్రహ్మము స్వీయ మాయాబల

మున వికారమై, యసంఖ్యాకములగు జీవకోటిగ బరిణమించి
నటుల దోచుచున్నదనియు, గాని సద్విమర్శాదృష్టి బరిశీలిం
చుచో నది యథార్థమైన మార్పుగాక వివర్తరూపమున
జరిగినదనియు శ్రీశంకరాద్వైతవాదము. అనగా బ్రహ్మము
నిర్వికారమై యున్నను నతని నధిష్ఠానముగ గల్గిన అఘటనా
ఘటన సామర్థ్య సంపన్నమైన మాయ అనేక రూపముల
జిత్రించి, ఆడించి మరల నా బ్రహ్మమునందే లయ మొనర్చు
చున్నదని తాత్పర్యము. అట్టి దృష్టాంతములు లోకమున
నెన్నియో గలవు. మందాంధకారమున జూడబడిన త్రాడు
సర్పరీతి గోచరించుట సామాన్యానుభవమేగదా! అటులే
మృగతృష్ణ నాబడు ఎండమావును గాంచి అజ్ఞజీవులగు పశు
పక్ష్యాదులేగాక మానవులుగూడ జలప్రవాహమని భ్రమించి
యన్వేషించుటయు విదితమే. అట్టివే శాస్త్రవర్ణిత శుక్తిరజత,
స్థాణుపురుషాదిక భ్రాంతులు. అందు నధిష్ఠానరూపమైన
పదార్థమును మరుగుపరచి తానే సత్యముగ భాసించును.
అనగా ముందు గల రజ్జువుపై ద్రష్టలో సంస్కారరూపమున
గల సర్పము, తనకు రజ్జువునకు గల సాదృశ లక్షణముల
నండగ గైకొని రజ్జువుపై దానే భాసించి, సర్పభ్రాంతిని
ద్రష్టకు గలుగజేయుచున్నది. యథార్థమైన అధిష్ఠాన రజ్జు
జ్ఞానము కలుగగనే అసలు సత్యముగ నట నభావమైన సర్ప
మదృశ్యమై సత్యమైన రజ్జుజ్ఞానము ప్రస్ఫుటకిరియ దోచును.
స్వప్నదృష్టాంతమునగూడ సుషుప్తినున్న వ్యక్తి నిర్వికార
మున నుండ, అతనిలోగల చిత్తము స్వీయ సంస్కారముల,

రూపవంతము గావించి, యనేక దృశ్యముల చిత్రించి వానితో క్రీడించి, సుఖదుఃఖముల ననుభవించి, స్వప్నాంతమున మనస్సులో లయమగుచున్నది. ఇచ్చట నధిష్ఠానము మనస్సు. దృశ్యములు సంస్కార జన్యములు. ఎట్లైనను ఉన్నది మరుగుపడి, అట లేనిది దానిపై భాసించి, అదియే సత్యమైనట్లు భ్రాంతిని కలుగజేయుచుండుటయే యిందలి రహస్యము.

పై సిద్ధాంతరీతిగా వ్యష్టిరూపమున గోచరించు నీ జీవకోటి కధిష్ఠానముగ బ్రహ్మము గలదనియు, నీ జీవరాసులతో బ్రపంచము భ్రాంతిజన్యమనియు నర్థము. భ్రాంతి యనుటతోడనే అయథార్థములని భావింపక నప్రధానములని గ్రహించుట ముఖ్యము. కాన వ్యష్టిరూపములైన వివిధ దృశ్యములు ప్రధానముగాక తదాధారభూతమైన బ్రహ్మము ముఖ్యాతిముఖ్యస్థానము నలంకరించుచున్నది. ఈ తాత్పర్యగ్రహణమున తజ్ఞునిలో విశాలత్వమేర్పడి, ప్రాపంచిక సుఖ సముదాయముపై మోహము క్షీణించి, ఎల్లకాలముల బ్రశాంతచిత్తుడై యతడలరారుచుండును. కాని దీని భ్రాంతిరూపముగ ద్రోసిరాజనుచు, లోకక్షేమమున కతడు కృషి సల్పడనువాదము లేకపోలేదు. అట్లు పూర్వమెన్నడును జరిగియుండలేదు. అద్వైతానంద విభూతుల నోలలాడిన మహాగురువరేణ్యులు తమ యసమాన మనోబలముచే బ్రపంచశాంతికి మార్గదర్శులై సదా వెలుగొందుచునే యున్నారు. వారనుభవించుచున్న యలౌకికానుభూతి సర్వమానవులకు దూరమగుట వారెఱుంగుదురు. కాని దాని నితరులు సంపాదింప బూర్వోక్త యమ నియమాదుల నిష్ణాతలై పరిసరముల,

కాదర్శ శ్రేయోమూర్తులుగ బరిణమించుచుండవలెను. అందుచేతనే వ్యాస, శంకరాదులు వేదాంత- శ్రవణము నితరులకొరకు ప్రతిపాదించిరి. దానికై సాధన సంపద్విభూషితులై యలరారవలయునని నియమ మేర్పరచి యుండిరి. ఇట్లు అద్వైతసిద్ధి గోరువారు ప్రథమతః ఆత్మ సంఘ సంస్కరణ కార్యముల బాధ్యులై కాలాంతరమున శుద్ధాద్వైత సుఖమున మునిగి ప్రపంచ సుఖములనుండి విశ్రాంతి గైకొనిన సంఘమునకు నష్టమేర్పడదు. ప్రభుత్వోద్యోగియైనను ఉద్యోగ కాలమున సక్రమరీతి బాధ్యతల నిర్వహించి, కొందరికి శిక్షణ మొసంగి నియమిత కాలానంతరమున ఉపవేతనమున విశ్రాంతి గైకొనుచుండుట సాధారణమేగదా! అదేరీతి నద్వైతాచార్యులును తమ నాశ్రయించిన శిష్యవర్గముల జిత్తసీమల బవిత్రపరచి, శుద్ధసంస్కారముల నభివృద్ధి జేసి, తద్రూపముగ సంఘము నుజ్జీవింపజేసి, విశ్రాంతిలో ఆధ్యాత్మికానందము ననుభవించుచుండుటయం దెట్టి దోషము నుండదు. అందుచేతనే శ్రీ శంకరులు కేవల మద్వైత దివ్యానందమున లయించి యుండక, తత్సిద్ధాంతమును దేశవ్యాప్తముగ ప్రబోధించి, యంత దృప్తిగాంచక ప్రశస్త మఠముల నల్దిశల స్థాపించి, భారతావనిగూడ నాలుగు భాగముల విభజించి, ఆ పీఠాధిపతులకు నా యా భాగముల ప్రజానీక యోగక్షేమాభివృద్ధి బాధ్యత నొప్పగించి యుండిరి. పూర్వమా యాచార్యులు దేశపర్యటన గావించుచు నుండెడివారు. వా రా సమయముల సంఘద్రోహచర్యల నుండువారి దమ ఆధ్యాత్మిక శక్తిచే శిక్షించుచు, సంఘమును బునీతము

గావించుచు నుండెడివారు. అద్వైతానుభూతి నిమగ్నులగు వారు. మహాపురుషులకు సర్వప్రపంచము, దానియందు గల సర్వ చరాచర జీవకోటియు దమ స్వరూపమే యని విస్పష్ట లీల గోచరింప నిక వారు దేనిని నిర్లక్ష్యము సేయుదురు? దేనిని త్యజింతురు? విరాడ్స్వరూపుడైన ఆ యద్వైతానంద స్వరూపునికి సర్వథా తన శరీరాంతర్గతముగ విభాగములే. ఎవడైన తన శరీరమున గల భాగముల గొన్నింటిని నిర్లక్ష్య ముగ జూచునా? అట్టి సంకుచిత దృష్టి సర్వ బాధాకరమై, సర్వనాశనకరమని గుర్తెరుంగడా? అట్టి అనుభవ సంపన్ను డగు నద్వైతవాదియు నని గ్రాహ్యము. నిత్య మద్వైతానంద సౌధముల విహరించు శ్రీ రామకృష్ణదేవుడేమి, అద్వైతారణ్య విహారకేసరి యగు వివేకానందుడేమి, సంఘ శ్రేయమును నిర్లక్ష్యము చేసిరా? మీదుమిక్కిలి ప్రపంచవ్యాపక దివ్యోప దేశముల గావించి, సర్వతోముఖాభివృద్ధికై నడుము బిగిం చుట సర్వజన విదితము. కాన నద్వైత సిద్ధాంతమున వ్యష్టికి బాధాన్యతనీయక, సమష్టి దృష్టితో వ్యష్టిని బవిత్రము గావించి, సమష్టి దర్శనము గావింపజేసి, వ్యష్టిసమష్టుల యేకత్వమును బ్రస్ఫుటానుభవమున గోచరింపజేసి, సమష్టి రూప సంఘము నుద్ధరించుటయే తాత్పర్యముగా నేర్పడు చున్నది.

మరియు, జీవుడు బ్రహ్మేతర పదార్థముగా దా నెరుం గుటయే భ్రాంతి యనియు, సాధు సాంగత్యము, శ్రవణసాధ నాదులచే దానే బ్రహ్మమని ఎప్పుడు గ్రహించుకొనునో అదియే అద్వైతసిద్ధి యనియు సిద్ధాంతము. అనగా నత డెంత

కాలము వ్యష్టిననియు, నతనికి ప్రత్యేకత గలదనియు నెంచుచు, జాతి మత వర్ణ లింగ భేదముల నెంచుచుండునో అంతవరకత డజ్ఞాని యనియు, నత డద్వయానంద సౌఖ్యమును జూరగొన జాలడనియు, నందుచే క్రమశః యీ విభేదముల దొలగద్రోసి కొనుచు, విశాలత్వమునకు నధిగమింపవలయుననియు నద్వైత, సిద్ధాంతచోదిత సంఘమున సర్వ తారతమ్యములు అదృశ్యమై ఎల్లరకు సమాన ప్రతిపత్తి యుండుననియు గ్రహింపదగి యున్నది. వ్యష్టిగత సర్వ తారతమ్యముల నతిక్రమించి, సమష్టి దృష్టిని బెంపొందించుకొనుచు మనుటయే అద్వైతవాద సాధనా విధానముగ నెరుంగవలెను.

అటులనే విశిష్టాద్వైత సిద్ధాంతమునగూడ వ్యక్తము. సర్వము విష్ణ్వంశము, విష్ణ్వంతర్గతము, విష్ణుస్వరూపమే. అద్వయమైన బ్రహ్మము శరీరత్రయాత్మకము. అందు ప్రకృతి స్థూలశరీరము, జీవుడు సూక్ష్మము, ఈశ్వరుడు కారణశరీర మని యీ సిద్ధాంత తాత్పర్యము. అనగా సూక్ష్మదృష్టి ప్రసన్నచిత్తుడై, స్థూలచిత్తమును సూక్ష్మముగావించి, విభిన్న మూర్తులుగ గోచరించు ప్రపంచముపై దృష్టిని దొలగించి, యీ పరమాత్మపై ప్రసరింపజేయుచు, సద్గురు సన్నిధానమున సాధన సాగించుచో, ఆ యనంత కళ్యాణగుణగణ విభూషితు డైన పరమాత్మ కృపాప్రాప్తిచే విశ్వరూపదర్శనము సంప్రాప్తించును. ఆ దృశ్యమున ప్రపంచము బ్రహ్మేతర పదార్థముగ నుండదు. అజ్ఞానదృష్టి కన్యముగా దోచు జీవులును ఆ దివ్య దృష్టిలో బరబ్రహ్మమున కన్యములుగావుగదా! భగవద్గీతా శాస్త్రమున విశ్వరూపసందర్శన యోగమున దీని రహస్యము

పరిస్ఫుటము. ఈ దర్శనభాగ్యము నొందిన భాగ్యశాలికి దన వ్యక్తిత్వము ప్రత్యేకము గాదనియు, అంశాంశిరూపమున శ్రీమహావిష్ణ్వంతర్గతమనియు, దన శ్రేయము సర్వ శ్రేయమనియు గ్రహించి శ్రేయస్కామియై జాగృతి మెలంగును. శరీరావయవముల నేదేని బాధాకరమై శరీర విచ్ఛిత్తికి గారణముగ బరిణమించిన తన్నిర్మూలన మెట్లు ముఖ్యమో, అట్లే సంఘమునకు బాధాకరముగ రూపొంది సంఘ నాశనమునకు హేతుభూతమైన అరాచక వ్యక్తుల నిర్మూలించుటయు నత్యావసరమని శ్రీవిష్ణువే అవతారముల దాల్చి, ధర్మగ్లాని కాలముల దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కార్యమును ధరించి, యవతరించుటయు గ్రహించి మానవుడు ధర్మతత్పరుడై ప్రవర్తించును. మరియు సంఘమున నెట బాధ యేర్పడినను అది తన సోదర బాధగ స్వీకరించి నివారింప నత డుద్యుక్తుడగును. కరమునకు బాధ యేర్పడిన శరీరమునంతటికి బాధయేగదా! అందుచే బాదము కరగత బాధానివారణమునకై దోడ్పడుటయం దాశ్చర్యము లేదు, అది స్వాభావికమే యగుచున్నది. అంతియగాక నట్టి ప్రవృత్తి సమంజసము, సముచితము. మన శరీరమున నింద్రియములు పరస్పర సహకారులై చెలంగుట నిత్యానుభూతియేగదా. అటుల వ్యష్టి సమష్టి క్షేమమునకై శ్రమించి, వ్యష్టి క్షేమమునే బొందుచున్నది. ఈ విధానము మధ్వాచార్య ప్రతిపాదిత ద్వైతసిద్ధాంతమునగూడ నన్వయము. జీవ బ్రహ్మ ప్రకృతులచే బంచ విభేదముల ద్వైతము సిద్ధాంతము జేసినను అది పరస్పరాధీనముగాన నై పద్ధతి యిటగూడ గ్రాహ్యము. ఇదేవిధముగ నితర మతములను

గూడ విశాలదృష్టి బరిశీలించినచో నిదే సిద్ధాంతము వ్యక్తమగును.

పరిసమాప్తి

అందుచేతనే శాంతస్థితి జీవింప యత్నించుచో "ఆత్మనస్తు కామాయ పతిః ప్రియో భవతి" అని ప్రారంభించి, ప్రపంచమున సర్వ సంబంధముల నెంచి చూపించి, "న వా అరే సర్వస్య కామాయ సర్వం ప్రియం భవతి, ఆత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి" అని ఉపనిషత్తులు పర్యవసానము దేల్చివైచినవి. లోకమున గల సర్వ సంబంధ బాంధవ్యముల నా యా వ్యక్తుల బాహ్యసంబంధముల గాంచి ప్రేమింపక, వారియందును తనయందును గల సర్వ వ్యాపక సమష్టిరూప సర్వాధారక ఆత్మనే దృక్పథమున నిడుకొని మెలంగవలెనవి ప్రబోధించుచున్నవి. ఆత్మ యనఁగ అనిర్దేశ్యము, అనిర్వాచ్యము, సాధనా సిద్ధము గాన నా యవ్యక్తమును వ్యక్తముగావించి, నా యాత్మనే నారాయణ స్వరూపముగా "అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః" అను ఉపనిషద్ధమునే గ్రహించి, ఆధునికయుగ శాంతి సంధాతలగు రామకృష్ణ వివేకానందులును, మహాత్ముడును, వ్యష్టిలో గల సమష్టిరూప నారాయణాంశమును దిలకించి, యా నారాయణసేనకై ప్రజానీకమును బ్రబోధించియున్నారు. వారినుండియే బధిరనారాయణ, అంధనారాయణ, దరిద్రనారాయణాది పదము లుద్భవించి దేశవ్యాప్తి నొంది, సేవా కార్యముల కుత్సాహశక్తుల బ్రసరింపజేయుచున్నవి.

పై విధానమున శాంతి తాత్పర్యమును గ్రహించి,

తదనుభూతిసంపద్విశిష్టుల సన్నిధానమున, సద్విద్యావ్యాసంగముద్వార యమనియమాది శిష్టగుణ సముపార్జనము గావించి సంకుచిత లౌకిక దృష్టి కతీతాధ్యాత్మికపథము నవలంబించి తదనుగుణాత్మక శక్తియుక్తుల అద్భుత ప్రబోధముల హృదయమున స్థాపించి, వ్యష్టి సమష్టి సమన్వయము గుర్తించి, స్వీయ సంస్కరణమున నాత్మోద్ధరణమును, తన్మూలమున జగదుద్ధరణమును సంకల్పించి, శ్రమించు మహోత్తమ విధానము నెవ రాశ్రయించెదరో అట్టివారే శాంతిసామ్రాజ్యమును బ్రపంచ వ్యాప్తముగ స్థాపింపగల్గుదురు. తత్సిద్ధికి నెల్లరు యత్నించి, సాధించి గమ్యమును పొందెదరుగాక! ప్రపంచమున శాంతి నెలకొని శోభిల్లును గాక! అద్దానికై పరమేశ్వరు డనుగ్రహించుగాక!

"ఉత్తిష్ఠత జాగ్రత ప్రాప్య వారాన్నిబోధత"

"Arise Awake and Stop not till the Goal is reached"

వాణీ ప్రెస్, విజయవాడ-2